క్లుప్తంగా

ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కాచిగూడ: బీసీ(డీ)లో ఉన్న ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ఆరెకటిక సేవా సమితి అధ్యక్షుడు కల్యాణ్ కార్ ఈశ్వర్ చౌదరి బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కులస్తులను కేవలం ఓటు బ్యాంకులాగా మాత్రమే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని 2014లో బాల్కొండ ఎన్నికల బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని మర్చిపోవడం బాధాకరమని అన్నారు. దేశంలోని 18 రాష్ట్రాలలో తమ కులం ఎస్సీ జాబితాలో, కర్ణాటక రాష్ట్రంలో బీసీ-ఏలో ఉందని, కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ-డీ కింద ఉందని గుర్తుచేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.

సాయిబాబా కాలనీలో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి

కాచిగూడ: సాయిబాబానగర్ కాలనీలో గురువారం కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్డు మీద చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలను ఆదేశించారు. పనిచేయని వీధి దీపాలను తొలగించి కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చుక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పు హర్షణీయం

కవాడిగూడ: నిజమైన అధికారం ఎన్నికైన ప్రభుత్వానికి ఉండాలని సుప్రీం కోర్టు ఏకగ్రీవ తీర్పును ప్రకటించడం పట్ల ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఏకగ్రీవ తీర్పు ప్రజాస్వామ్యం సమైక్యవాదంపై విశ్వాసాన్ని పునరుద్ధరించిందని ఆయన పేర్కొన్నారు. గురువారం దోమలగూడలోని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ క్రేజీవాల్ నేతృత్వంలో ఆమ్‌ఆద్మీ పార్టీకి ఓటు వేసిన ప్రజల ఆదేశాన్ని దిక్కరించి ప్రధాని మోదీ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలని సుప్రీం కోర్టులో రూలింగ్ ఇవ్వడాన్ని స్వాగతించారు.

కాచిగూడ పోలీసులపై కమిషనర్‌కు ఫిర్యాదు

కాచిగూడ: బొట్టుపెట్టుకుని కాషాయ కండువా వేసుని కేరళ స్టోరీ సినిమాకి వస్తే కాచిగూడ పోలీసులు చితకబాదారని బాధితుడు హితేష్ హర్మ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. కాచిగూడలోని పద్మావతి థియేటర్‌లో కేరళ స్టోరీ ప్రదర్శనకు వెళ్లిన తమపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని కమిషనర్, ఈస్ట్ జోన్ డీసీపీలకు సమర్పించిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఎంత ప్రాధేయపడినా కనికరించకుండా దుర్భాషలాడుతూ కొట్టారని ఆయన తెలిపారు.

నివాళి



కాచిగూడ: గోల్నాకకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత కన్నా కుమార్తె భావన (పింకీ) ఆత్మహత్య చేసుకుంది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భావన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించి, సంతాపాన్ని తెలియజేశారు. కన్నాను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు.

యువతి ఆత్మహత్య

కాచిగూడ: గోల్నాక శాంతినగర్‌కి చెందిన భావన (28) అదే ప్రాంతానికి చెందిన సాయి కుమార్‌ను పెద్దల అంగీకారంతో 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం వేధించడంతో ఈనెల 9న విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా భావన తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయింది. భావన తండ్రి రేడపాక కర్నేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు భావన భర్త సాయికుమార్, అత్త రుక్మిణి, మామ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేశారు.

ఆధునిక సౌకర్యం.. మెరుగైన వైద్యం

గాంధీకే సాధ్యం

రూపురేఖలు మారనున్న గాంధీ ఆస్పత్రి

- ప్రారంభానికి సిద్ధంగా మూడు భవన సముదాయాలు
- అందుబాటులోకి మరింత మెరుగైన వైద్యసేవలు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రూపురేఖలు మారనున్నాయి. అత్యాధునిక సదుపాయాలు, కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన మూడు నూతన భవన సముదాయాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. గాంధీ అత్యవసర విభాగం వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) నిర్మిస్తున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)తో గర్భిణులు, బాలింతలు రెండింతలు, రోగి సహాయకుల సంఖ్య నాలుగింతలు పెరిగే అవకాశం ఉందని భావించిన ఆస్పత్రి అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎంసీహెచ్ భవనం ప్రక్కనే అత్యాధునిక డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. డైట్ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను ఇన్ పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులకు అందించేందుకు ప్రత్యేక ఆకాశ వంతెనలు (స్కై బ్రిడ్జ్) నిర్మించనున్నారు. ఓపీ విభాగం ముందు ప్రైవేటు మెడికల్ షాపుల భవనంపైన నిర్మించిన మరో అంతస్తులో నైట్ షెల్టర్ అందుబాటులోకి రానుంది.

రూ.50 కోట్లతో ఎనిమిది అంతస్తుల్లో..

రూ. 50 కోట్ల వ్యయంతో జీ+8 అంతస్తుల్లో చేపట్టిన మాతాశిశు సంరక్షణ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అధునాతన వైద్య యంత్రాలు, పలు రకాల వసతులు, సౌకర్యాలతో కూడిన ఐసీయూ, ఆధునిక ఆపరేషన్ థియేటర్లతో పాటు మరో రెండు వందల పడకలు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడుతారు. ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పిడియాట్రిక్ విభాగాలను ఇక్కడకు తరలించి, తల్లి బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. గైనకాలజీ, పిడియాట్రిక్, అనస్థీషియాతో పాటు పలు రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం గాంధీలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ఎంసీహెచ్ భవనం అందుబాటులోకి వస్తే ప్రసవాల సంఖ్య రెట్టింపు అవుతుంది.

సాక్షి వరుస కథనాలతో స్పందన

రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటిన్ సమస్య వైద్యమంత్రి హరీష్‌రావు చొరవతో పరిష్కారమైంది. రూ.2.25 కోట్ల నిధులు కేటాయించడంతో అత్యాధునిక హంగులతో చేపట్టిన నూతన డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆస్పత్రి డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరడంతో మురుగునీరు సెల్లార్‌తోపాటు డైట్ క్యాంటిన్‌ను ముంచెత్తింది. తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్న మురుగు మధ్యలోనే ఆహార పదార్థాలు తయారు చేయడాన్ని స్వయంగా చూసిన పలువురు వైద్యులు డైట్ క్యాంటిన్ భోజనాన్ని తిరస్కరించారు. గతంలో పర్యటించిన జిల్లా కలెక్టర్, గాంధీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) చైర్మన్ శర్మన్ మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌ను చూసి ఖంగుతున్నారు. మురుగుతో నిండిన డైట్ క్యాంటిన్‌పై సాక్షి దినపత్రిక పలుమార్లు ప్రధాన శీర్షికతో కథనాలు ప్రచురించగా స్పందించిన మంత్రి హరీష్‌రావు నిధులు కేటాయించారు.



చివరి దశలో మాతాశిశు సంరక్షణ భవనం

సీడీఎంఏ ఆధ్వర్యంలో నైట్ షెల్టర్..

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో రూ.91 లక్షల వ్యయంతో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో చేపట్టిన నైట్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోగితోపాటు సహాయకులుగా ఒకరికి మాత్రమే వార్డులోకి అనుమతి ఉంది. రోగిని డిశ్చార్జి చేసేంత వరకు మిగిలిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ షెడ్లు, చెట్ల కింద రోజుల తరబడి ఉంటున్నారు. గాంధీ ఇన్‌పేషెంట్ విభాగంలో నిత్యం సుమారు రెండు వేల మంది చికిత్సలు పొందుతుంటారు. రోగి సహాయకులు కాలకృత్యాలు తీర్చుకుని, రాత్రి సమయాల్లో నిద్రించేందుకు నిర్మించిన షెల్టర్‌హోంలో మొత్తం వంద పడకలు ఏర్పాటు చేసి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కేటాయించారు.



కొనసాగుతున్న డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం

త్వరలోనే అందుబాటులోకి



గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం, డైట్ క్యాంటిన్, నైట్‌షెల్టర్ భవన సముదాయాల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వైద్యమంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించి సీఎం కేసీఆర్ ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్య తెలంగాణ ఆవిష్కరణకు మా వంతు కృషి చేస్తాం.

–ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

స్టీల్‌బ్రిడ్జి కింద పార్కింగ్ స్థలం కేటాయించాలి

చిక్కడపల్లి: అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్డు వరకు నిర్మాణమవుతున్న స్టీల్‌బ్రిడ్జి కింది భాగంలో తమకు పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యాపారులు, దుకాణ యాజమానులు గురువారం షాపులు మూసేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ ఫెడరేషన్ ప్రతినిధులు సింగారపు రమేష్‌గుప్తా, రమేశ్‌గాంధీ, మజీద్, మహావీర్‌జైన్, నాగేశ్, వాసు మాట్లాడుతూ.. ఆర్టీసీక్రాస్ రోడ్డు నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు స్టీల్‌బ్రిడ్జి కింది భాగంలో 5 యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని, ఇటు పాదచారులు నడవడానికి వీలుగా 10 కాలిబాటాలు నిర్మించాలని, 6 ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. వ్యాపారులు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ వ్యాపారులను కలిసి వారితో సంప్రదింపులు జరిపారు. మీ సమస్యలన్నీ సంబంధింత అధికారులు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో మీముందే చర్చస్తామని, సానుకూల పరిష్కారం చూపిస్తామని హామీనివ్వడంతో వ్యాపారులు తమ ఆందోళనను విరమించారు.

24 గంటల్లో పరిష్కరించకుంటే నిర్మాణాన్ని అడ్డుకుంటాం

–కార్పొరేటర్ పావని..

వ్యాపారులతో కలిసి నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపిన గాంధీనగర్ కార్పొరేటర్ పావని మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు 24 గంటల్లోగా సమస్య పరిష్కారం కాకపోతే స్టీల్‌బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. అవసరం లేనిచోట స్టీల్‌బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారని ఆమె మండిపడ్డారు. నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు నర్సింగ్‌రావు, ఉమేష్, సురేందర్, సత్తిరెడ్డి, సురేష్, నవీన్‌కుమార్, శివకుమార్, రవియాదవ్, రఘుయాదవ్ పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య పార్కు ఆధునీకరణ పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ రవిచారి తదితరులు

కవాడిగూడ: నగరంలోనే సుందరయ్య పార్కును ఉత్తమంగా సుందరీకరించినట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ కార్పొరేటర్ రవిచారి అన్నారు. సుందరయ్య పార్కును రూ.40 లక్షలతో చేపట్టిన ఆధునీకరణ(రెనోవేషన్) పనులను కార్పొరేటర్ రవిచారితో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కులో అర్బన్ బయో డైవర్సిటీ విభాగం డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ భాస్కర్‌తో కలిసి కలియ తిరిగారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సుందరయ్య పార్కులో గతంలో రూ.32 లక్షలతో ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట సామగ్రిని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం పార్కులో గ్రీనరీతో సందర్శకులను ఆహ్లాదపర్చే విధంగా నూతనంగా ఆధునీకరణ పనులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశామన్నారు. వాకర్స్‌కు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడానికైనా కార్పొరేటర్ రవిచారితో కలిసి అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ.. సుందరయ్య పార్కు అభివృద్ధి కోసం ఎల్లవేళల అందుబాటులో ఉంటానన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ ప్రెసిడెంట్ మోజస్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటకృష్ణ(బబ్లు), హౌస్ ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్‌రావు, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కవాడిగూడ: యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచించారు. తొలి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్ క్రికెట్ లీగ్-2 6వ రోజుకు చేరుకుంది. గురువారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లకు డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెమోరియల్ అధ్యక్షుడు సమతారెడ్డి, ఉపాధ్యక్షుడు నాయిని దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నేత శ్రీను, కల్వ గోపి, బి.రమేష్, సిరిగిరి శ్యామ్, కార్తీక్ యాదవ్, సాయియాదవ్, అజ్జు పాల్గొన్నారు.

నేడే ఆఖరు..

నాయిని నర్సింహ్మారెడ్డి జయంతిని పురస్కరించుకోని ఎస్ఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ లీగ్-2 టోర్నమెంట్‌ను ఎన్టీఆర్ స్టేడియంలో ఆరు రోజులుగా క్రీడాస్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. మే 12న ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగియనుంది. ఈ టోర్నమెంట్‌లో నగర వ్యాప్తంగా వందకు పైగా టీమ్‌లు పాల్గొన్నాయి. ప్రతిరోజూ 42 మ్యాచ్‌లను రెండు గ్రౌండ్‌లలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా నిర్వహించారు. మే 12న సాయంత్రం ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరుగుతుంది. ప్రథమ బహుమతి గెలిచిన టీమ్‌కు రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదు బహుమతులను అందజేయనున్నట్లు మెమోరియల్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు నగర వ్యాప్తంగా క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు.



శ్రీనివాస్‌రెడ్డితో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

కోట శంకర్‌రావుకు ఎన్టీఆర్ పురస్కారం

చిక్కడపల్లి: నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఈనెల 15న త్యాగరాయగానసభలోని లలిత కళా వేదికపై నిర్వహిస్తున్నామని ప్రముఖ మహిళా సంస్థ రాగరాగిణీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు రమణకుమారి, కార్యదర్శులు సుబ్బులక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వందల నాటకాల్లో విలక్షణ పాత్రలు, పలు సినిమాల్లో విలన్ పాత్రలు పోషించిన కోట శంకర రావును ఎన్టీఆర్ స్మారక పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా శాసనమండలి మాజీ సభ్యుడు రుద్రరాజు పాల్గొనగా, కళా పోషకుడు సి.రామకృష్ణ అధ్యక్షత వహిస్తారని వారు పేర్కొన్నారు. తెలుగు భాషా ప్రచార కర్త శైలజ, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నటించిన చిత్రాలలోని పాటలు సత్యప్రసాద్ వ్యాఖ్యానంలో రమణ కుమారి, శశికాంతి, అంబాదాసు, దినకర్, విజయ్‌కుమార్ ఆలపిస్తారని వారు తెలిపారు.

'రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్ష పదవీ నుంచి తొలగించాలి'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యాదవ సమాజిక వర్గ మనోభావాలు దెబ్బతినే విధంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం శోచనీయమని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కులవృత్తులను ప్రొత్సహించాల్సింది పోయి ఆ వృత్తులను కించపరిచే విధంగా మాట్లాడడం ఎంత వరకు సమంజమన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై వివిధ రకాలుగా మాట్లాడిన మాటలు అభ్యంతరకరమైనవని, యాదవులంతా నిజాయితీవంతులనే విషయం అనే రాజకీయ పార్టీలలోని పెద్దలు చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ విధంగా ఒక సామాజిక వర్గాన్ని వారి కులవృత్తులను కించపరిచే విధంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాడ్ చేశారు.

పెద్దలను స్మరించుకోవటం సంస్కారం



పొత్తూరి సుబ్బారావుకు పురస్కారం అందజేస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: పెద్దలను స్మరించుకోవడం ఉత్తమ సంస్కారమని ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గురువారం సాయంత్రం త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై కళాసుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన సాహితీ పురస్కారం సాహితీ కిరణం పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావుకు అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి పురస్కారం బహుకరించి మాట్లాడుతూ.. కళాసుబ్బారావు కార్యదక్షుడు ఆయన వ్యక్తి స్థాయి నుంచి వ్యవస్థగా ఎదిగారన్నారు. వేదికపై విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, బి.అపర్ణ పాల్గొన్నారు.

సీఐ సుమన్‌కుమార్‌కు పోలీస్ మెడల్

నల్లకుంట: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సీసీఎస్ సీఐ ఎం.సుమన్‌కుమార్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్కృష్ట సేవా పురస్కారాన్ని అందుకున్నారు. 15 ఏళ్ల సర్వీస్‌లో నిస్వార్థంగా సేవలు అందించినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. గతంలో ఆయన నల్లకుంట లా అండ్ ఆర్డర్ సీఐగా విధులు నిర్వహించి ఉన్నతాధికారులచే మన్ననలు అందుకున్నారు. బుధవారం సాయంత్రం జరిగిన మోడల్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన హోం శాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా సుమన్‌కుమార్ ఈ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్కృష్ట మెడల్ రావడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సుమన్ కుమార్‌కు పోలీస్ మెడల్ అందజేస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ

చిక్కా దేవదాసుకు భారత్‌సేవ ప్రపూర్ణ బిరుదు ప్రదానం

చిక్కడపల్లి: ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ చిక్కా దేవదాసుకు ఆత్మీయ అభినందన సభ సత్కారం, భారత్ సేవా ప్రపూర్ణ బిరుదును ఈనెల 15న సోమవారం సాయంత్రం 4.30గంటలకు త్యాగరాయ గానసభలో కళాసుబ్బారావు కళావేదికలో కళానిలయం ఓంకార సంఘం సాంస్కృతిక సంయుక్త ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు కళానిలయం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి పుష్పలత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పేరు మీద వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

'అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకున్న యూనివర్సిటీలను రద్దు చేయాలి'

కాచిగూడ: అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకున్న గురునానక్, శ్రీనిధి యూనివర్సిటీలను వెంటనే రద్దు చేయాలని బీజేవైఎం హైదరాబాద్ సిటీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శ్రీనిధి, గురునానక్ యూనివర్సిటీలను రద్దుచేసి ఆయా కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి, ఇష్టానుసారంగా గురునానక్, శ్రీనిధి యూనివర్సిటీలు నియమ నిబంధనలు ఉల్లంఘించి మంత్రి కేటీఆర్ అండదండలతో ఆయా యూనివర్సిటీలలో అడ్మిషన్లు చేసుకుని లక్షల రూపాయలను డొనేషన్లు తీసుకొని దాదాపు 6వేల మంది విద్యార్థుల జీవితాలను రోడ్డుపాలు చేసిందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కాచిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. వైద్యానికి అవసరమైన డబ్బుల కోసం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, రూ.48 వేలు మంజూరయ్యాయి. ఎండీ ఫరీద్ అలీకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును గురువారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు.

